
రోగ నిర్ధారణలో కీలకం

రేపు అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవం

- రేడియాలజీ విభాగం నివేదిక ఆధారంగానే వైద్యసేవలు
- జీజీహెచ్‌లో ఆధునిక రేడియాలజీ యూనిట్





రేడియాలజీ డే పోస్టర్స్

గుంటూరు మెడికల్: అరికాలు మొదలుకొని నడినెత్తివరకు వచ్చే పలు వ్యాధులను నిర్ధారించి రోగులకు ఎటువంటి వైద్య చికిత్సలు చేయాలో తెలుసుకునేందుకు వైద్యులకు రేడియాలజీ ఎంతగానో సహాయపడుతుంది. రోడ్డు ప్రమాదాల్లో కాలు లేదా చేయి విరిగిందా లేదా అనే విషయం తెలుసుకోవాలన్నా, బ్రెయిన్‌కు ఏమైనా దెబ్బతగిలిందా లేదా అనే విషయాలను సైతం రేడియాలజిస్టులు నిర్ధారించి చెప్పిన తరువాతే వైద్యసేవలను వైద్యులు అందిస్తారు. రోగికి ఎటువంటి జబ్బు వచ్చిందో నిర్ధారించడం దగ్గర నుంచి చికిత్స మధ్యలో జబ్బు ఏ మేరకు తగ్గుముఖం పట్టిందో వైద్యులు ఎప్పటికప్పుడు తెలుసుకోవడంలో రేడియోగ్రఫీ కీలక పాత్ర పోషిస్తుంది. ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త రాంట్‌జెన్ 1895వ సంవత్సరం నవంబర్ 8వ తేదీన తన భార్య చేతికి మొట్ట మొదటిసారిగా ఎక్స్‌రే తీశారు. 1896 జనవరి నెలలో ఎక్స్‌రేని ప్రెజెంట్‌చేసి, ప్రపంచానికి అందుబాటులోకి తెచ్చారు. 2012 నుంచి ప్రపంచవ్యాప్తంగా పలు రేడియాలజీ సొసైటీలు అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవాన్ని నవంబర్ 8న నిర్వహిస్తున్నాయి.

వ్యాధుల నిర్ధారణలో కీలకం...

వైద్యరంగంలో పేరుగాంచిన వైద్యులకు వెన్నెముకలాగా ఉండి వ్యాధి నిర్ధారణను సకాలంలో ఖచ్చితత్వంతో నిర్ధారించేది రేడియాలజిస్టులే. పెద్ద పెద్ద ఆపరేషన్లు చేసే వైద్యులు రేడియాలజిస్టులు ఇచ్చే రిపోర్ట్‌పైనే ఆధారపడి వ్యాధిని నిర్ధారించుకుని ఆపరేషన్లు చేస్తారు. రేడియోగ్రఫీలో ప్రముఖంగా ఎక్స్‌రే, అల్ట్రాసోనోగ్రామ్, సీటీ స్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్ వంటి పరీక్షల ద్వారా రోగుల్లో ఉన్న ఎలాంటి జబ్బునైనా ఇట్టే కనిపెట్టి వారికి కావాల్సిన వైద్య చికిత్సలు అందించేందుకు దోహదపడుతున్నాయి. రేడియోగ్రఫీపై వైద్యులు, ప్రజలు అవగాహన పెంపొందించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. రేడియాలజీ వైద్య రంగంలో వచ్చిన ఆధునిక వైద్య పద్ధతులు, వైద్య పరికరాల ద్వారా త్వరితగతిన వ్యాధినిర్ధారణ పరీక్షలు చేసి రోగులకు సకాలంలో వైద్యం అందించేలా రేడియాలజిస్టులు కృషి చేస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో 24 గంటలు రేడియాలజీ వైద్యసేవలు ఉచితంగా అందిస్తున్నారు. జిల్లాలో 50 మంది రేడియాలజిస్టులు సేవలను అందిస్తున్నారు.

స్క్రీనింగ్‌తో ముందుగానే తెలుసుకోవచ్చు....

అప్పుడే పుట్టిన పసికందు మొదలుకొని పండు ముసలి వరకు అందరికీ కూడా రేడియాలజీ వైద్య సేవల ద్వారా పలు రకాల వ్యాధులను ముందస్తుగానే గుర్తించి చికిత్స అందించవచ్చు. 13 ఏళ్ళ బాలిక నుంచి 20 ఏళ్ళ యువతుల వరకు వచ్చే అసాధారణ పీరియడ్స్ సమస్యలను, పెళ్ళి అయిన పిదప పిల్లలు పుట్టకపోవటం వల్లే వచ్చే వంధత్వం సమస్యలను అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలతో ముందస్తుగానే స్క్రీనింగ్ చేయించుకోవటం ద్వారా తెలుసుకోవచ్చు. సీటీస్కాన్, ఎంఆర్‌ఐ స్కానింగ్ పరీక్షల ద్వారా మెదడు సంబంధిత, వెన్నుముక సంబంధిత, శరీరంలోని ఇతర అవయవాలకు వచ్చే అనారోగ్య సమస్యలను గుర్తించి చికిత్స అందించవచ్చు. అల్ట్రాసౌండ్ స్కానింగ్, మెమోగ్రామ్‌తో రొమ్ము క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్‌లు వస్తాయా రావా అనే విషయాలను ముందస్తుగానే తెలుసుకోవచ్చు.

పుట్టబోయే బిడ్డ ఆరోగ్య స్థితి తెలుసుకోవచ్చు



రేడియాలజీ వైద్య సేవల ద్వారా పుట్టబోయే బిడ్డల ఆరోగ్య పరిస్థితి ముందుగానే తెలుసుకుని తగు చికిత్సలు కూడా అందించవచ్చు. గర్భిణికి 11 నుంచి 14 వారాల గర్భంలో ఎన్‌టీ స్కానింగ్ చేయటం ద్వారా పుట్టబోయే బిడ్డలకు జన్యుపరమైన లోపాలు వస్తాయా రావా అనే విషయాలను ముందుగానే గుర్తించవచ్చు. టిఫా స్కానింగ్ పరీక్ష ద్వారా గర్భంలో ఎదిగే బిడ్డ సాధారణంగా ఉందా లేదా ఏదైనా సమస్యలతో ఉందా అనే విషయాన్ని తెలుసుకోవచ్చు.

– డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి, ప్రసూతి, సంతాన సాఫల్యత వైద్య నిపుణురాలు, గుంటూరు

స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి....



రేడియాలజీ వైద్య విభాగంలో వచ్చిన అనేక ఆధునిక వైద్య పద్ధతుల ద్వారా అనేక రకాల ఆరోగ్య సమస్యలను ముందస్తుగానే స్క్రీనింగ్ పరీక్షలు చేసి తెలుసుకోవచ్చు. అల్ట్రాసౌండ్ స్కాన్ పరీక్షలు అన్నిరకాల వయస్సుల వారికి అతి తక్కువ ఖర్చులోనే లభిస్తున్నాయి. ఎంఆర్‌ఐ స్కానింగ్‌లో అతి సూక్ష్మమైన వ్యాధుల సమస్యలను సైతం గుర్తించవచ్చు. సీటీ యాంజియో ద్వారా శరీరంలోని ప్రతి అవయవానికి రక్త సరఫరా ఏ విధంగా ఉందో తెలుసుకోవచ్చు. కార్డియాక్ సీటీ ద్వారా హార్ట్ ఎటాక్ వస్తుందా రాదా అనే విషయం ముందుగానే తెలుసుకోవచ్చు.

– డాక్టర్ చక్కా సుజాత, సీనియర్ రేడియాలజిస్ట్, గుంటూరు

175 సీట్లు గెలిచేందుకు సమష్టిగా కృషి చేద్దాం

- తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా
- ప్రజాసంకల్పయాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా వేడుకలు
- 4వ డివిజన్‌లో మహానేత విగ్రహానికి నివాళి



మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

నగరంపాలెం: రాష్ట్ర ప్రజలు గత 2019 ఎన్నికల్లో 151 అసెంబ్లీ సీట్లతో వైఎస్సార్ సీపీని గెలిపించారని, వచ్చే ఎన్నికల్లో 175 నియోజకవర్గాలకు 175 స్థానాల్లో గెలుపొందేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేద్దామని ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా పిలుపునిచ్చారు. గత ఎన్నికల ముందు ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 3,648 కిలోమీటర్ల ప్రజా సంకల్ప యాత్రకు సోమవారంతో ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా 4వ డివిజన్ కార్పొరేటర్ మహమ్మద్ ఆధ్వర్యంలో నందివెలుగురోడ్డులోని దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నూరి ఫాతిమా, అంజుమన్ అధ్యక్షుడు అబ్దుల్ కర్నూమా, నాయకులు తోట మణికంఠ, రామనబోయిన అజయ్‌యాదవ్, వాకా శ్రీనివాసరెడ్డి, పోలవరపు వెంకటేశ్వరరావు, పాపతోటి అంబేడ్కర్, కేసరి సుబ్బులు రెడ్డి, ఉమమహేశ్వరరావు, రాము పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

మిర్చియార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ



మాట్లాడుతున్న యార్డు చైర్మన్ నిమ్మకాయల

కొరిటెపాడు(గుంటూరు): విధి నిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ హెచ్చరించారు. యార్డు ఆవరణలోని సమావేశ మందిరంలో యార్డులో పనిచేస్తున్న వేమెన్స్‌తో సోమవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి గానీ, రైతులకు గానీ నష్టం కల్గించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చిన్న చిన్న లోపాలు ఉంటే సవరించుకోవాలని కోరారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి యార్డుకు వచ్చే మిర్చి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలందించాలన్నారు. వేమెన్స్ వారికి కేటాయించిన మిర్చి కమీషన్ షాపులలో అందుబాటులో ఉంటూ నమ్మకంతో పనిచేయాలని సూచించారు. నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించి ప్రభుత్వానికి, మార్కెట్ యార్డుకు మంచి పేరు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి, యార్డు ఇన్‌చార్జి శివారెడ్డి, వేమెన్స్ పాల్గొన్నారు.

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



అధ్యక్షుడు గోపవరపు శివచే ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, చిత్రంలో పశ్చిమ ఎమ్మెల్యే గిరి

పాత గుంటూరు: మంగళదాస్‌నగర్ మెయిన్‌రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గుంటూరు నగర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు షేక్ మహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్‌రావు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యవర్గ అధ్యక్షుడిగా గోపవరపు శివ సత్యనారాయణ గుప్త, ఉపాధ్యక్షులుగా మాజేటి రామారావు, చింతా నాగేశ్వరరావు, వనమా నరేంద్ర, కార్యదర్శి పోలిశెట్టి రామకిషోర్, కోశాధికారిగా కట్టమూరి రవి, సహాయ కార్యదర్శులు మద్దు సాంబశివరావు, మిరియాల వెంకటేష్, సంపత్‌కుమార్, సభ్యులచే ఎమ్మెల్యే ముస్తఫా ప్రమాణం చేయించారు. అతిథులు మాట్లాడుతూ కార్యవర్గ సభ్యులు సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో నగర యువత అధ్యక్షుడు గార్లపాటి రవికిరణ్, గుంటూరు అర్బన్ ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం సభ్యులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

బలమైన సంకల్పం.. ఆలోచన దివ్యం

- తీవ్ర మధుమేహంతో కాలు కోల్పోయిన పొన్నూరు మండలం ఆలూరు గ్రామానికి చెందిన షేక్ బాబావలి
- గుండె సంబంధిత సమస్యతోనూ బాధపడుతున్న వైనం
- గుర్తించి చలించిన బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురలీకృష్ణ
- జైపూర్ పాదాలు చేయించి, స్వయంగా తొడిగి నడిపించిన వైనం



బాబావలిని నడిపిస్తున్న అంబటి మురళీకృష్ణ

కొరిటెపాడు(గుంటూరు): పొన్నూరు మండలం, ఆలూరు గ్రామానికి చెందిన షేక్ బాబావలి అదుపు తప్పిన మధుమేహంతో తీవ్ర అనారోగ్యం పాలై చివరకు తన కుడి కాలును నడుము కింది వరకు కోల్పోయి దివ్యాంగుడిగా మారాడు. తీవ్ర నైరాశ్యంతో బతుకుబండిని ఈడుస్తున్నాడు. బజరంగ్ ఫౌండేషన్ నేతృత్వంలో ఇటీవల కట్టెంపూడి గ్రామంలో చేపట్టిన మీ గుండె పదిలం కార్యక్రమానికి హాజరైన బాబావలి పరిస్థితిని చూసి ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ చలించిపోయారు. ఈ వైకల్యం చాలదన్నట్లు మరోవైపు బాబావలి గుండెలో బ్లాక్ ఏర్పడి స్టంట్ వేయాల్సిన పరిస్థితి ఉన్నట్లు వైద్య శిబిరంలో నిర్ధారణ అయింది. ఇదంతా చూసిన అంబటి మురళీకృష్ణ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. బాబావలిని ఈ అనారోగ్య సుడిగుండం నుంచి బయటపడేయాలని బలమైన సంకల్పం తీసుకున్న మురళీకృష్ణ బజరంగ్ ఫౌండేషన్ 'మీ గుండె పదిలం' ద్వారా అతనికి అందాల్సిన గుండె వైద్యాన్ని ఓ వైపు కొనసాగిస్తూనే, మరోవైపు జైపూర్ పాదాల తయారీకి సిద్ధమయ్యారు. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ప్రత్యేకమైన కొలతలతో బాబావలి కోసం రూపొందించిన జైపూర్ పాదాలతో సోమవారం ఆలూరు గ్రామంలోని బాబావలి నివాసానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మురళీకృష్ణ జైపూర్ పాదాలను బాబావలికి అందజేసి, తొడిగిన పాదంతో నడిపించి ప్రోత్సహించారు. బజరంగ్ ఫౌండేషన్ తరపున అతని ఇంటిలో ఒక వెస్టన్ కమోడ్‌ను నిర్మించి ఇవ్వడానికి ఏర్పాట్లు చేశారు. అంతేకాకుండా నడక తర్ఫీదు అయిన వెంటనే విజయవాడకు తీసుకువెళ్లి స్టంట్ వేయాలని నిర్ణయించారు.

గడప గడపకు వైద్యసేవలు



నగరంపాలెం: గడప గడపకు వైద్యసేవలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నూరిఫాతిమా అన్నారు. ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా ఆదేశాల మేరకు ఆరో డివిజన్ పరిధిలోని గొలుసు నాంచారమ్మ పాఠశాలలో సోమవారం మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి హాజరైన వృద్ధులు, మహిళలను ఆమె పలకరించారు. ఆరోగ్యం ఎలా ఉంది, ఏవైనా అనారోగ్య సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ ఈసారి జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. నాయకులు నూర్ అహ్మద్, ప్రసాద్, నరేంద్ర పాల్గొన్నారు.

ప్రజలతో సత్సంబంధాలు అవసరం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రజలతో సత్సంబంధాలను నెలకొల్పడంలో కమ్యూనికేషన్ ఎంతో కీలకమని ఏఎన్‌యూ జర్నలిజం-మాస్ కమ్యూనికేషన్ విభాగాధిపతి డాక్టర్ జి.అనిత పేర్కొన్నారు. సోమవారం అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో కార్పొరేట్ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ఎంబీఏ విద్యార్థులకు ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న డాక్టర్ అనిత మాట్లాడుతూ కమ్యూనికేషన్ అనేది పెద్దకళ అని, ప్రజా సంబంధాలను అభివృద్ధి పర్చడంలో కార్పొరేట్ కమ్యూనికేషన్స్ ఎంతో అవసరమన్నారు. శ్రద్ధగా వినడం, వినియోగదారుని మనసులో బ్రాండ్ ఇమేజ్ ముద్ర వేయడంతో పాటు విపత్కర పరిస్థితుల్లో సత్వర నిర్ణయాలు తీసుకోవడం ముఖ్యమన్నారు. కార్పొరేట్ ఎథిక్స్‌ను కలిగి ఉండటంతో పాటు చర్యల ద్వారా కంపెనీ ప్రతిష్టను పెంచుకోవడం, సాంకేతిక సామర్థ్యాన్ని కలిగి ఉండటం తప్పనిసరి అని వివరించారు. దూరదర్శన్ ప్రతినిధి రవిశంకర్ మాట్లాడుతూ మీడియా ద్వారా ఆధునిక వ్యాపారం నడుస్తోందని, మీడియాతో సత్సంబంధాలను కలిగి ఉండటం ద్వారా సమాజ పోకడ తెలుస్తుందన్నారు. తద్వారా ఆధునిక వ్యాపార శైలిని అవగాహన చేసుకోవాలని సూచించారు. ఏఎన్‌యూ రీసెర్చ్ స్కాలర్ ఒలీవ మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ గేమ్స్ గురించి విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ సమయానుకూలంగా సంభాషించడం, పద్ధతులను గురించి తెలియజేశారు. ఐక్యూఏసీ ప్రొఫెసర్ డాక్టర్ కె.లలిత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సీహెచ్ వైష్ణవి, ఎ.బాజీబాబు, వి.అభిలాష్, ఎస్.మణికంఠ, అనిత, ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి

జీఎంసీ అదనపు ఇన్‌చార్జి కమిషనర్ శ్రీనివాస్



ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అదనపు ఇన్‌చార్జి కమిషనర్ శ్రీనివాస్

నెహ్రూనగర్: ప్రజల నుంచి స్పందనలో అందే ఫిర్యాదులను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కారం చేయాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి అదనపు కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో స్పందన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి జగనన్నకు చెబుదాం, స్పందనకు అందే ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని, విభాగాల వారీగా జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారానికై ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలన్నారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలు జత చేయాలన్నారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారీగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలన్నారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 23 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 7, ఇంజినీరింగ్ విభాగానికి 4, రెవెన్యూ విభాగానికి 6, ప్రజారోగ్య విభాగానికి 4, ఉపా సెల్ విభాగానికి 2 చొప్పున ఫిర్యాదులు అందాయని, ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, మేనేజర్ శివన్నారాయణ, ఏసీపీలు, ఏసీపీలు, సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

నేడు ఆచార్య ఎన్జీ రంగా జయంతి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉత్తమ పార్లమెంటేరియన్, రైతు బాంధవుడు ఆచార్య ఎన్జీ రంగా 124వ జయంతి సందర్భంగా మంగళవారం ఉదయం 8:30 గంటలకు బృందావన్ గార్డెన్స్ సెంటర్‌లోని రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామని రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ సోమవారం తెలిపారు. ఆయన అభిమానులు, రైతాంగ శ్రేయోభిలాషులు పాల్గొనాలని కోరారు.

దీక్షా దక్షతకు సంకేతం ప్రజా సంకల్పయాత్ర



మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న లాలుపురం రాము, నాయకులు

నగరంపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దీక్షాదక్షతకు తిరుగులేని సంకేతంగా ప్రజా సంకల్పయాత్ర చరిత్రలో సజీవంగా నిలుస్తుందని జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురంరాము) అన్నారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గతంలో చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర ఆరేళ్ల పూర్తయిన సందర్భంగా బృందావన్ గార్డెన్స్‌లోని ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో సోమవారం దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి అర్బన్ బ్యాంక్ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ గుంటూరు క్లస్టర్ – 4 అధ్యక్షుడు బందా రవీంద్రనాథ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంకల్పయాత్రలో అన్నివర్గాల ప్రజలను పలకరించిన వైఎస్ జగన్ ఎన్నికల్లో గెలిచి సీఎంగా అయిన తరువాత నవరత్నాలతో ప్రజలందరికీ అండగా, తోడుగా ఉన్నారని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, క్లస్టర్ అధ్యక్షులు నూనె ఉమామహేశ్వరరెడ్డి, బైరెడ్డి రంగారెడ్డి, భాస్కర్, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), అచ్చాల వెంకటరెడ్డి, గురవయ్య, పడాల సుబ్బారెడ్డి, వీరాంజనేయులు, గీతా మందిరం చైర్మన్ వెలుగూరి అభయశ్రీ ప్రసాద్, అన్నదాన సత్రం చైర్మన్ పోకల వసంత్, రంగనాయక దేవస్థానం చైర్మన్ వెంకటరమణ, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ నూతలపాటి వెంకటేశ్వరరావు, గనిక ఝాన్సీ, నాయకులు పాల్గొన్నారు.

బిల్డర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి



మేయర్ కావటి మనోహర్ నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న బిల్డర్లు

నెహ్రూ నగర్: బిల్డర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ క్రెడాయి గుంటూరు చైర్మన్ సతీష్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం మేయర్ క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక శాఖ నిబంధనలకు అనుగుణంగానే పశ్చిమగోదావరి జిల్లాలోని తణుకు టీడీఆర్ బాండ్లు కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం సదరు టీడీఆర్ బాండ్లు ద్వారా సమర్పించిన అప్లికేషన్లు ప్రభుత్వం నిలిపివేయడంతో ప్లాన్ అప్రూవల్ వచ్చి బిల్డింగ్ నిర్మాణం పూర్తయిన వాటికి కూడా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. గత రెండు సంవత్సరాలుగా బిల్డర్ల దగ్గర ఫ్లాట్లు కొన్న సామాన్య ప్రజానీకం ఎంతో ఇబ్బంది పడుతున్నారని మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యకు తగిన పరిష్కారం చూపేలా చొరవ చూపాలన్నారు. మేయర్‌ను కలిసిన వారిలో అధ్యక్షుడు మామిడి రాము, సెక్రటరీ వినోద్ రెడ్డి పాల్గొన్నారు.

విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులకు పతకాల పంట



విద్యార్థులతో విజ్ఞాన్ స్కూల్ ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస్

గుంటూరు ఎడ్యుకేషన్: క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులు పతకాలను కైవసం చేసుకున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. ఎల్‌ఐసీ కాలనీలోని విజ్ఞాన్ స్కూల్లో సోమవారం జరిగిన విద్యార్థుల అభినందన సభలో ఆయన మాట్లాడుతూ ఈనెల 4వ తేదీన అమరావతి రోడ్డులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో గుంటూరు నగర పరిధిలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో తమ విద్యార్థులు సంగీత, నృత్య, స్పెల్‌బీ, చేతిరాత, ఆర్ట్, ఫ్యాన్సీ డ్రెస్, లాంగ్ జంప్, పరుగు పందెం, షాట్‌పుట్ పోటీల్లో విజేతలుగా నిలిచారని వివరించారు. లాంగ్ జంప్‌లో ఎం. ఉమా నిఖిల్ ద్వితీయ స్థానంలో నిలువగా, ఎ.నరసింహారెడ్డితో పాటు 100 మీటర్ల పరుగులో ఎ.శశాంక్ సాయి భగవత్, ఆర్ట్‌లో సీహెచ్ విజయ, స్పెల్‌బీలో ఎస్.పూజశ్రీ వరుసగా తృతీయ స్థానాల్లో నిలిచినట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు విద్యార్థులను అభినందించారు.

కులగణన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

లక్ష్మీపురం: కుల గణన చేయాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని అవగాహన సంస్థ స్వాగతిస్తుందని, సక్రమంగా చట్టబద్ధత కల్పించి నిర్వహించాలని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విశ్లేషకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు అయితేనే కుల గణన నమ్మకంగా సాగుతుందని అప్పుడే బీసీలు, ఇతర అన్ని వర్గాల ప్రజలు అందరూ దానిని ఆమోదిస్తారని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రంలోని జర్నలిస్టుల చిరకాల వాంఛ నెరవేర్చబోతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేస్తున్నామని ఆ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మేడవరపు రంగనాయకులు తెలియజేశారు. సోమవారం అరండల్ పేటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యవర్గ సమావేశంలో రంగనాయకులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలోని ప్రతి ఒక్క జర్నలిస్టుకు మూడు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చేందుకు ప్రత్యేక మంత్రివర్గ సమావేశం ద్వారా నిర్ణయం తీసుకోవడం సంతోషదాయకమన్నారు. త్వరలో రాష్ట్రంలోని జర్నలిస్టులందరూ 'థాంక్యూ సీఎం' పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎ.శివ కేశవరావు, నేలపాటి రవి, వర్కింగ్ ప్రెసిడెంట్స్ మాలంపాటి శ్రీనివాసరావు, వంగపాటి శివ, ప్రధాన కార్యదర్శి కె.రామారావు, సహాయ కార్యదర్శులు మామిడాల శ్రీనివాసరావు, చెవుల శ్రీనివాసరావు, నాయకులు ఎం.ఎస్.ఆర్.ప్రసాద్, ఎస్ఎస్ఆర్ రాజు, యజ్ఞనారాయణ, కాటూరి వంశీ, ఎస్.శివశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో పతకాలు



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఇటీవల విజయవాడలో జరిగిన 22వ జాతీయస్థాయి కరాటే పోటీల్లో తమ విద్యార్థులు అద్భుత ప్రతిభకనబరిచారని ఏఎస్ జూడో కరాటే అకాడమీ ఎండీ ఆలపాటి రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ అకాడమీ నుంచి 11 మంది పాల్గొనగా ముగ్గురు బంగారు, నలుగురు రజిత, నలుగురు కాంస్య పతకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా చిన్నారులను కోచ్ ఎ.లక్ష్మీ ప్రసన్న కుమారి, చీఫ్ కోచ్ పి.రాంబాబు అభినందించారు.

బీజేపీ మైనార్టీ మోర్చా కోస్తాంధ్ర జోన్ ఇన్‌చార్జిగా షేక్ రఫీ

గుంటూరు మెడికల్: బీజేపీ మైనార్టీ మోర్చా కోస్తాంధ్ర జోన్ ఇన్‌చార్జిగా గుంటూరుకు చెందిన షేక్ రఫీని నియమిస్తూ మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా రఫీ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. మైనారిటీలను కలుపుకొని రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని వెల్లడించారు. తనకు పదవి వచ్చేలా సహకరించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి, జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకు కృతజ్ఞతలు తెలిపారు.

కిడ్నీ వ్యాధి బాధితునికి ఆర్థికసాయం

గుంటూరు మెడికల్: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మేడిశెట్టి రాంబాబు అనే 27 సంవత్సరాల వ్యక్తికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తులసి యోగీష్ సోమవారం గుంటూరులోని యోగి భవన్‌లో రూ. 15వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కిడ్నీ డయాలసిస్ కొరకు రూ. 15 వేల రూపాయలును రోగి పినతల్లి పోకల శివలక్ష్మి కుమారికి అందచేసారు. బీజేపీ జిల్లా మాజీ కార్యదర్శి అప్పిశెట్టి రంగారావు ఉన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణను అడ్డుకున్న అధికారులు



పెదకాకాని: ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని అక్రమంగా షెడ్డు ఏర్పాటు చేస్తుండటంతో రెవెన్యూ అధికారులు అడ్డుకున్న సంఘటన సోమవారం పెదకాకానిలో చోటు చేసుకుంది. గ్రామంలోని భ్రమరాంబపురం కాలనీలోనికి వెళ్లే మార్గంలో జాతీయ రహదారికి సమీపంలో కొందరు ప్రభుత్వ భూమిని ఆక్రమించి షెడ్డు ఏర్పాటు పనులు చేపట్టారు. అక్రమంగా షెడ్డు నిర్మిస్తుండడంతో స్థానికులు తహసీల్దార్ కార్యాలయానికి సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న షెడ్డును తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఒక్కరోజు గడువులో తొలగిస్తానని సంబంధిత వ్యక్తులు కోరడంతో పనులు నిలిపివేసి రెవెన్యూ అధికారులు వెళ్లిపోయారు. అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న వారిలో వీఆర్‌ఓలు మహేష్, శ్రీనివాసరావు, నరసింహారావు ఉన్నారు.

బీఎల్వోలు క్షేత్రస్థాయిలో విచారించాలి

మంగళగిరి: బీఎల్వోలు మరోసారి ఓటర్ల జాబితాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేయాలని తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్ అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ నూతన జాబితాలతో ప్రతి బీఎల్‌వో క్షేత్రస్థాయిలో పర్యటించి ఓటర్లను విచారించి తమ ఓటులో ఏమైనా తప్పులుంటే సరిదిద్దేలా చూడాలన్నారు. అంతేకాక 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏదైనా ఒకే డోర్ నెంబర్‌లో అధిక ఓటర్లుతో పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు.